# ఎస్ఆర్‌లు ఎక్కడ?

- ఖమ్మం జిల్లా విద్యా శాఖలో 'సర్వీస్ రిజిస్టర్ల'కు భద్రత లేదా?
- ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవులకు ఇంటి నుంచి ఆఫీసుకు 'ఎస్ఆర్'లు
- పలువురు సిబ్బంది నిర్వాకం.. ఏడాదిగా ఇదే పద్ధతిలో నిర్వహణ



ఖమ్మం, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం జిల్లా విద్యాశాఖలో సర్వీస్ రిజిస్టర్ల(ఎస్ఆర్)కు భద్రత లేనట్లుగా కనిపిస్తున్నది. ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవుల కోసం ఇంటి నుంచి ఆఫీసుకు ఎస్ఆర్‌లను తీసుకెళ్లి తీసుకొస్తుండడంతో వాటి భద్రతపై అనుమానాలు కలిగిస్తున్నది. ఉద్యోగి నియామకమైనప్పటి నుంచి మొదలుకొని పదవీ విరమణ అనంతరం పింఛన్ చెల్లింపు వరకు జరిగే మార్పులన్నీ ఎస్ఆర్‌లో నమోదు చేస్తారు. ఉద్యోగి జీవితంలో ఎస్ఆర్(సేవా పుస్తకానికి) ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఎస్ఆర్‌లో అన్ని వివరాలు నమోదు చేసి ధ్రువీకరించాల్సిన బాధ్యత కార్యాలయ అధికారిపై ఉంది. ఉద్యోగికి తన ఎస్ఆర్‌ను చూసుకొనే హక్కు ఉన్నప్పటికీ కార్యాలయ అధికారి మాత్రమే పర్యవేక్షించాలి. కానీ.. ఇందుకు భిన్నంగా విద్యాశాఖలో జరుగుతున్నది. కార్యాలయ అధికారి పర్యవేక్షణలో ఉండాల్సిన సిబ్బంది సర్వీస్ రిజిస్టర్లు కార్యాలయంలో కాకుండా సిబ్బంది ఇళ్ల వద్ద ఉంటున్నాయి. ఏడాది కాలంగా ఇదే పద్ధతిలో నిర్వహణ సాగిస్తున్నారు. ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవుల సమయంలో ఇళ్ల నుంచి తీసుకొచ్చి మళ్లీ ఎస్ఆర్‌లను తీసుకెళ్తున్నట్లు తెలుస్తున్నది.

### బాధ్యత ఎవరిది..

ఉద్యోగికి సర్వీస్ పుస్తకం ఇవ్వాల్సిన అవసరం ఏర్పడితే ఉద్యోగి నుంచి ఒక అర్జీపత్రం తీసుకోవడం తప్పనిసరి. ఎస్ఆర్ అతడికి ముట్టినట్లుగా డిక్లరేషన్‌ను కూడా తప్పకుండా తీసుకోవాలి. దీనికి డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్(డీడీవో) పూర్తి బాధ్యుడిగా ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఉద్యోగ జీవితంలో కీలకపాత్ర పోషించే ఈ సర్వీస్ రిజిస్టర్‌పై విద్యాశాఖలో పర్యవేక్షణ కొరవడింది. జీవో 152 ప్రకారం ఉద్యోగి బదిలీ అయిన సందర్భంలో కూడా అతడి ఎస్ఆర్.. బదిలీ అయిన కార్యాలయ అధికారికి పోస్టు ద్వారా పంపించాలి. కానీ.. బదిలీ అయిన ఉద్యోగికి సర్వీస్ రిజిస్టర్ ఇచ్చి పంపకూడదు. వీటన్నింటినీ పట్టించుకోని విద్యాశాఖ అధికారులు.. ఎస్ఆర్‌పై పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు.

### ఏడాదిగా ఇదే తంతు..

ప్రతీ ఉద్యోగికి సర్వీస్ రిజిస్టర్ ఆయువు పట్టులాంటిది. దానిలో నమోదు చేసిన విషయాల ఆధారంగానే అతడి రిటైర్మెంట్ తరువాత అన్ని రకాల సౌలభ్యాలూ అందుతాయి. అంతటి ప్రాముఖ్యత కలిగిన సర్వీస్ రిజిస్టర్‌ను కార్యాలయంలో ఉంచకుండా కొందరు అధికారులు, సిబ్బంది తమ వద్దే ఉంచుతున్నారు. ఏడాది కాలంగా ఇదే విధంగా కొనసాగుతోంది. బదిలీల కంటే ముందు ఓ మహిళా ఉద్యోగి.. తన వద్ద ఉన్న ఎస్ఆర్‌లను సిబ్బందికి అందజేశారు. తాను బదిలీ అయిన తర్వాత సెక్షన్ కేటాయించిన ఉద్యోగికి సిబ్బంది ఎస్ఆర్‌లను అందజేయలేదు. ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవులు ఇతరత్రా అంశాల నమోదు కోసం వాటిని సదరు సిబ్బంది తమ ఇంటి వద్ద నుంచి తీసుకురావడం, నమోదు అనంతరం మళ్లీ తీసుకువెళ్లడం వంటివి జరుగుతున్నాయి. ఇలా తీసుకెళ్లి తీసుకొచ్చే సమయంలో ఎస్ఆర్‌కు ఏదైనా జరిగితే సదరు ఉద్యోగి భవిష్యత్ ఏంటన్నది ప్రశ్నార్థకమవుతోంది.

### సెక్షన్ల మార్పులు..

జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో అన్ని విభాగాల్లో అన్ని హోదాల్లో కలిపి సుమారు 53 మంది వరకు ఉద్యోగులు ఉన్నారు. సెక్షన్ల ఆధారంగా వీరు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా నలుగురైదుగురు మినహా సిబ్బంది అందరికీ సెక్షన్ల మార్పులు చేశారు. రెవెన్యూ నుంచి విద్యాశాఖలోకి వచ్చిన ఉద్యోగికి ఎస్ఆర్‌ల పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. సెక్షన్లు కేటాయించే సమయంలో కూడా ఎస్ఆర్‌లు కార్యాలయంలో లేవనే విషయం కూడా తెలియకపోవడం గమనార్హం.

### తెప్పించి భద్రపరుస్తాం..



పాత కార్యాలయం నుంచి నూతన కలెక్టరేట్‌లోకి మా శాఖను మార్చిన సమయంలో పూర్తిస్థాయిలో బీరువాలు తీసుకొచ్చేందుకు అనుమతించలేదు. సర్వీస్ రిజిస్టర్లు కార్యాలయంలోనే ఉండాలి. ఒకటి రెండు రోజుల్లో సిబ్బంది నుంచి సర్వీస్ రిజిస్టర్లు తెప్పించి మా కార్యాలయంలో భద్రపరుస్తాం.

–సోమశేఖర శర్మ, డీఈవో, ఖమ్మం

# ప్రభుత్వంపై ప్రజాగ్రహం

- 'ఉచిత' వాగ్దానాలతోనే అధికారంలోకి 'కాంగ్రెస్'
- 11 నెలల పాలనలో హామీల అమలులో ఘోర వైఫల్యం
- 'లగచర్ల'లో గిరిజన భూములను లాక్కుంటున్న 'రేవంత్'
- ఖమ్మంలో పంటల కొనుగోళ్లు లేవు.. మద్దతు ధరలు లేవు..
- రైతు సమస్యలపై 21, 22 తేదీల్లో జిల్లాకు మాజీ మంత్రి హరీశ్
- ఖమ్మంలో కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు 'తాతా'
- హాజరైన సండ్ర, లింగాల, కొండబాల, ఆర్‌జేసీ తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధుసూదన్, పక్కన బీఆర్ఎస్ నేతలు

ఖమ్మం, నవంబర్ 19 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజాగ్రహం మొదలైందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు స్పష్టం చేశారు. కేవలం ఉచిత హామీలతోనే అధికారంలోకి రావడం, పాలన ప్రారంభించిన 11 నెలలైనా హామీల అమలులో ఘోర వైఫల్యం చెందడం వంటివే ఇందుకు కారణమని తేల్చిచెప్పారు. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అని వర్గాల ప్రజల నుంచి ఇంత పెద్ద స్థాయిలో వ్యతిరేకతను తెచ్చుకున్నది దేశంలోకెల్లా రేవంత్ ప్రభుత్వం మాత్రమేనని ఎద్దేవా చేశారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకుల విధానాలను చూసిన ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఆక్సీజన్‌ను అందిస్తున్నారని అన్నారు. సీఎం వ్యవహార శైలితో కాంగ్రెస్ నాయకులే అస్త్రసన్యాసం చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వంపై రైతులు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులూ రైతులకు న్యాయం చేయలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నెస్పీ కాలువకు పడిన గండిని పూడ్చేందుకే ఈ ప్రభుత్వానికి నెల సమయం పట్టిందంటే.. ఇక రైతుల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని విమర్శించారు. రైతులేగాక మహిళలు, కూలీలు, ఉద్యోగులు, వ్యాపారులు కూడా ఈ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని స్పష్టం చేశారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రజలు ఇప్పటి నుంచే ఈ విషయం గురించి చర్చించుకుంటున్నారని అన్నారు. అందుకని బీఆర్ఎస్ నాయకులు ఈ విషయాన్ని గమనించి ప్రజాక్షేత్రంలో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రంలో డిగ్రీ కళాశాలలు మూసివేస్తున్నారని; మిర్చి, పత్తి ధరలు అమాంతం పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ పేరుతో పత్తిని, కొర్రీలతో ధాన్యాన్ని కొనకపోవడంతో అన్నదాతలు అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

### సీఎం అల్లుడి కోసమే లగచర్ల భూములు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన అల్లుడి ఫార్మా కంపెనీకి భూములను అప్పగించేందుకే లగచర్ల ప్రాంతంలో గిరిజన రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని విమర్శించారు. భూములు ఇవ్వబోమంటున్న రైతులపై బలవంతంగా కేసులు పెడుతున్నారని, వారిని జైళ్లకు పంపుతున్నారని అన్నారు. లగచర్ల గిరిజన రైతుల ఉద్యమానికి మద్దతుగా, రైతులకు సంఘీభావంగా ఈ నెల 21న ఖమ్మంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ ర్యాలీలో పాల్గొనేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే, 22న ఖమ్మం ఏఎంసీలోని పత్తి, మిర్చి యార్డులను హరీశ్‌రావు పరిశీలించి రైతులతో మాట్లాడి వారి కష్టసుఖాలు తెలుసుకుంటారని అన్నారు. మద్దతు ధరలపై రైతులతో అక్కడే ముఖాముఖి కార్యక్రమం చేపడతారని అన్నారు. అనంతరం చింతకాని మండలంలో పర్యటించనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు పెట్టిన అక్రమ కేసుల వల్ల బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు ఇటీవల జైలుకు వెళ్లి వచ్చినందున హరీశ్‌రావు వెళ్లి ఆయనను పరామర్శిస్తారని తెలిపారు. ప్రొద్దుటూరు, లచ్చగూడెంలలో మృతిచెందిన రైతుల కుటుంబాలను పరామర్శిస్తారని అన్నారు.

### బీఆర్ఎస్‌ది ఎప్పుడూ ప్రజల పక్షమే : సండ్ర, లింగాల

అధికారం ఉన్నా, లేకున్నా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని బీఆర్ఎస్ నేతలు సండ్ర వెంకటవీరయ్య, లింగాల కమల్‌రాజు, కొండబాల కోటేశ్వరరావు, ఆర్‌జేసీ కృష్ణ పేర్కొన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల ఆదరాభిమానాలే శాశ్వతమని అన్నారు. ఈ విషయాన్ని గుర్తించి శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మధిరలో ఉప ముఖ్యమంత్రి భట్టి సతీమణి మరో షాడో మంత్రిగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఆమె చెప్పినట్లుగానే పోలీసులు నడుచుకుంటున్నారని, బీఆర్ఎస్ నాయకులపై అన్యాయంగా కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని విమర్శించారు. పార్టీ నాయకులు బిచ్చాల తిరుమలరావు, వెంకటరమణ, ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
- మణుగూరులో మహిళా ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా



సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరు టౌన్, నవంబర్ 19 : అన్ని వర్గాలకు అది చేస్తాం.. ఇది చేస్తాం.. అంటూ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు అలవికాని హామీలు గుప్పించారని, ఇప్పుడు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. పార్టీని మరింత పటిష్టం చేయడం కోసం, మహిళా పట్టణ, గ్రామ, బస్తీ అధ్యక్షుల ఎంపిక కోసం మణుగూరు పట్టణంలో బీఆర్ఎస్ మహిళా ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రేగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి కేవలం పల్లె వెలుగు బస్సులకే దానిని పరిమితం చేసిందని, రూ.2,500 చొప్పున ఇస్తామని చెప్పి ఆ మాటను విస్మరించిందన్నారు. ఉచిత గ్యాస్ ఉత్త మాటలయ్యాయని ఆరోపించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను తీసుకోవాలని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అందరూ సమష్టిగా పని చేయాలని కోరారు. రూ.2 లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు ఆ పార్టీని నమ్మరని, మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ మణుగూరు రూరల్ కన్వీనర్, కో కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, బోలిశెట్టి నవీన్, టౌన్ కన్వీనర్, కో కన్వీనర్ కుంట లక్ష్మణ్, నూకారపు రమేశ్, మహిళా అధ్యక్షులు రమాదేవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

### భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

పాల్వంచ, నవంబర్ 19 : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. పాల్వంచ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించిన ఆయన అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన 43 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో సీసీ కెమెరాల సహాయంతో చాలా నేరాలు ఛేదించామని, ప్రతీ ఠాణా పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన పాల్వంచ పట్టణ పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సతీశ్‌కుమార్, సీఐ వినయ్‌కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సైలు సుమన్, రాఘవయ్య, జీవన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల కల్పనకే ప్రజాభిప్రాయ సేకరణ

- ప్రజల డిమాండ్‌ను నివేదికలో పొందుపరుస్తాం..
- ఈ నెల చివరి నాటికి ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం
- సమగ్ర సర్వేలో ప్రజలు వివరాలు నమోదు చేసుకోవాలి
- మీడియా సమావేశంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్





మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

మామిళ్లగూడెం, నవంబర్ 19 : స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర వ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణ, సమగ్ర కులగణన వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన బీసీల ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మితోపాటు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఇప్పటికే 7 ఉమ్మడి జిల్లాల్లో అభిప్రాయ సేకరణ పూర్తి చేశామని, మరో మూడు జిల్లాల్లో పూర్తి చేసి ఈ నెల చివరి వరకు ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో వివిధ కుల, సామాజిక, రాజకీయ పార్టీల వారు 80 సెట్ల అభిప్రాయాలను అందజేశారని, రాజకీయ, సామాజిక పరిస్థితులపై పలువురు సమగ్ర నివేదికలు అందించారన్నారు. బీసీలలో సంచార జాతుల వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరినట్లు తెలిపారు. చిన్న, సంచార జాతులపై బీసీలోని ఉన్నత కులాలు వివక్ష చూపుతున్నాయని, దీనిపై ఆలోచన చేసి వివక్షకు గురవుతున్న బీసీ కులాలకు బీసీ అట్రాసిటీ చట్టం తేవాలని ఆయా వర్గాల ప్రజలు తెలిపినట్లు వివరించారు. కులగణనలో అధికారులు, ఎన్యుమరేటర్లు తప్పిదాలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పనిసరిగా ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు పూర్తి స్థాయి సమాచారం అందించాలని, ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా సర్వేకు సహకరించాలన్నారు. మేదరి, బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో, చాకలి, రజక కులాలను ఎస్సీ జాబితాలో చేర్చాలనే డిమాండ్ ఉందని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. మైనార్టీలకు విద్యా సౌకర్యాలు మెరుగుపరచాలని, డిగ్రీ గురుకులాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందని, దీనిపై కూడా ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలు తెలిపేందుకు హైదరాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయానికి నేరుగా రావచ్చన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జనవరి లేదా ఫిబ్రవరిలో జరిగే అవకాశం ఉన్నందున సాధ్యమైనంత త్వరగా నివేదికలు ప్రభుత్వానికి అందిస్తామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఖమ్మం జిల్లా బీసీ సంక్షేమాధికారి జ్యోతి, భద్రాద్రి జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇందిర, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

# ధరణిలో రైతుల భూమి మాయం

### సమస్యను పరిష్కరించాలని తహసీల్ ఎదుట ఆందోళన

### అధికారుల హామీతో ఆందోళన విరమించిన రైతులు



బోనకల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

బోనకల్లు, నవంబర్ 19 : పాస్‌బుక్‌లో భూమి ఉన్నా.. ధరణిలో ఆ భూమి కనిపించకపోవడంతో సదరు బాధిత రైతులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వ లబ్ధితోపాటు రుణమాఫీ కోల్పోతున్నామని, తమ సమస్యను పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో టెంట్ వేసి ఆందోళన చేపట్టారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. రావినూతల గ్రామానికి చెందిన ఎర్రగాని కొండలు, కృష్ణయ్య, వెంకటేశ్వర్లుకు నారాయణపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 236/ఆ/2/2/1లో 10 కుంటలు, 236/ఆ/2/3లో 1.09 ఎకరాలు, 236/ఆ/2/1, 237/ఈ/1/1, 237/ఈ/2 నెంబర్లలో 1.20 ఎకరాల భూమికి 2019లో పాస్‌బుక్‌లు వచ్చాయి. వీటితో కొంతకాలం రైతుబంధుతోపాటు ప్రభుత్వ ప్రయోజనాలు పొందారు. ఆరు నెలల క్రితం రుణమాఫీకి సంబంధించి తమ భూములకు 1బీ తీసుకునేందుకు మీసేవ కేంద్రానికి వెళ్తే భూమి ఉన్నట్లు చూపించడం లేదని వాపోయారు. దీంతో బాధిత రైతులు తహసీల్దార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. సర్వే చేసి భూముల వివరాలను ఆన్‌లైన్‌లో కనిపించేలా చూస్తామని హామీ ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. మిస్సింగ్ సర్వే నెంబర్ టీఎం 33 కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించినా పని కాలేదని తెలిపారు. దీంతో దిక్కుతోచని స్థితిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో బాధిత రైతులు వెనుదిరిగారు.


